# 3,87,206 మంది ఓటర్లు

**లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు ఓటరు జాబితా జూబ్లీహిల్స్ నియోజవర్గం ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేసిన అధికారులు**

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,87,206 మంది ఓటర్లు నమోదయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోఎన్నికల సంఘం అధికారులు ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నూతన ఓటర్ల నమోదు, సవరణలు చేపట్టిన అధికారులు తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఇటీవల ప్రకటించిన ముసాయిదా ప్రకారం, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,89,122 మంది ఓటర్లుండగా, తాజా జాబితాలో గణనీయంగా ఓటర్లు తగ్గారు. తుది ఓటరు జాబితాలో 2,02,172 మంది పురుషులు, 1,85,013 మంది మహిళలు, 21 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందున్న ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,56,995 మంది ఓటర్లుండగా 28 వేల పైచిలుకు ఓటర్లు పెరిగారు. దీంతో 3,85,265 మంది ఓటర్లు నమోదు కాగా, ఇటీవల చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 2024 జనవరి వరకు 18 ఏండ్లు నిండిన వారిని ఓటరు జాబితాలో చేర్చడంతో మొత్తంగా 32 వేల పైచిలుకు ఓటర్లు పెరిగి 3,89,122 మంది ఓటర్లు నమోదయ్యారు. కాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌తో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 1900 పైగా ఓటర్లు తగ్గారు. యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో డీసీ సేవా ఇస్లావత్, ఏఎంసీలు కమల్, బాలరాజుతో కలిసి ఫైనల్ పబ్లికేషన్‌ను గురువారం విడుదల చేశారు.



ఓటరు జాబితా విడుదల చేస్తున్న డీసీ సేవా ఇస్లావత్, చిత్రంలో తదితరులు

## మహవీర్‌లో రోడ్ సేఫ్టీపై అవగాహన

రోడ్డు సేఫ్టీపై ప్రతిజ్ఞ చేస్తున్న మహవీర్ కళాశాల విద్యార్థులు

మైలార్‌దేవపల్లి, ఫిబ్రవరి 8: రోడ్డు సేఫ్టీ ప్రమాణాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని మహవీర్ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. మహవీర్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ట్రోమా అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ నవీన్, డాక్టర్ సందీప్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై, రోడ్డు సెఫ్టీ అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో ముందుండాలన్నారు. రోడ్లపై ప్రమాదాలు జరిగినప్పుడు అలసత్వం ప్రదర్శించకుండా వెంటనే వారిని ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే రోడ్ సేఫ్టీపై ప్రతిజ్ఞని చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.పటేల్, హెచ్ వోడీ డాక్టర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

మణికొండ, ఫిబ్రవరి 8: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌తో ట్రేడ్ లైసెన్సులు ఇస్తామంటూ ప్రజలను ఇబ్బంది పెడుతూ డబ్బులు వసూలు చేస్తున్న వారి పట్ల మున్సిపాలిటీ వాసులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్ కుమార్ కోరారు. కొన్నాళ్లుగా మున్సిపాలిటీ పరిధిలో కొంత మంది అపరిచిత వ్యక్తులు తాము మున్సిపాలిటీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ వ్యాపార నిర్వాహణ కోసం లైసెన్సులు తీసుకోవాలంటూ, తక్షణమే డబ్బులు చెల్లించాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారనని పేర్కొన్నారు. ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని, అలాంటి ఫోన్‌కాల్స్ తమ కార్యాలయం నుంచి ఎవ్వరు చేయరని, అలా చేసేవారిపై అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ట్రేడ్ లైసెన్సులు కావాలనుకునేవారు ఏవైనా సందేహాలు ఉంటే మణికొండ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఎన్విరాన్మెంట్ విభాగం ఇంజనీర్ సంపత్‌ను సంప్రదించవచ్చు. వివరాలకు.. ఫోన్ నం. 9949157957.

## అభివృద్ధి పనుల నిర్వహణకు చర్యలు

**ఎమ్మెల్యే దానం నాగేందర్**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వివిధ బస్తీల నేతలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని 23 బస్తీలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావుతో పాటు వివిధ బస్తీలకు చెందిన నాయకులు, బస్తీ అధ్యక్షులు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను గురువారం కలిసి ఆయా బస్తీల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల తామంతా సమావేశమై ప్రాధాన్యత అంశాలపై చర్చించామని, రోడ్లు, సివరేజ్ లైన్లు, మంచినీటిలైన్లు తదితర పనులను చేపట్టాలని కోరారు. ఫిలింనగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, అంగన్‌వాడీల భవనాల నిర్మాణం, బసవతారకం నగర్ ఉర్దూ మీడియం స్కూల్‌పై అదనపు స్లాబ్స్, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, బీజేఆర్‌నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి తదితర పనులు చేపట్టాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే దానం నాగేందర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నగేష్ సాగర్, అబ్దుల్ ఘనీ, ఆకుల రాజు, కాటూరి రమేష్, ఓర్సు శ్రీనివాసులు. మాణిక్ చౌదరి, బాలస్వామి, ఏసుబాబు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 8: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి ప్రజాధనాన్ని వృథా చేయకుండా నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్ అధికారులకు సూచించారు. విఠల్‌వాడిలో కొనసాగుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం పరిశీలించిన ఆమె పనుల్లో జాప్యం జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిబస్తీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, పనుల్లో అధికారులు అలసత్వం సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం సన్యాసీరావు, మేనేజర్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, అనీష్ గంగపుత్ర, అభిషేక్ రెడ్డి, సుజాత, బస్తీవాసులు నవీన్, సత్యనారాయణ లాల్, సత్యం గౌడ్, వినోద్ గౌడ్, అలీ, లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

విఠల్‌వాడిలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మహాలక్ష్మి రామన్ గౌడ్

## అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: అపార్టుమెంట్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటూ కార్యవర్గం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను గురువారం కోరింది. ఎమ్మెల్యేను సోమాజిగూడ శాంతి శిఖర అపార్ట్‌మెంట్ కమిటీ గౌరవ అధ్యక్షులు, సీఎం మాజీ పీఆర్వో రమేశ్ హజారీ ఆధ్వర్యంలో సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ధని ఏలే, అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు ప్రభాత్, కోశాధికారి మాధవ రెడ్డి, సభ్యులు పద్మజ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే దానంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రమేశ్ హజారీ, ధని ఏలే, అనిల్, పద్మజ తదితరులు

## చెరువు స్థలాన్ని కాపాడాలని వినతి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మైలార్‌దేవపల్లి, ఫిబ్రవరి 8: చెరువులో అక్రమంగా మట్టిని డంప్ చేసి స్థలాల్ని ఆక్రమిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.ధనుంజయ్ కోరారు. మామిడి కుంట సర్వే నం: 247లో రాత్రి సమయంలో మట్టి డంప్ చేస్తూ ఆక్రమిస్తున్నారని తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే నం. 247లో 19 ఎకరాల 15 గుంటల చెరువు స్థలం ఉందన్నారు. ఈ చెరువులో రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ లారీలను తీసుకువచ్చి చెరువు స్థలంలో మట్టి డంప్ చేసి చెరువును మూసివేస్తున్నారన్నారు. ఇప్పటికే కొంత భాగం పూర్తిగా కబ్జాకు గురైందన్నారు. ఈ విషయమై గతంలో సైతం ఫిర్యాదులు చేశామన్నారు. చెరువు స్థలాన్ని కాపాడాలని ఆర్డీవో, తహసీల్దార్, కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు తిరుపతిరెడ్డి, వి.శ్రీశైలం, లక్ష్మణ్, శివ, శ్రీనివాస్, గండయ్య, సుధాకర్‌రెడ్డి, నాగేష్, సిద్ధు, పాండు, కిరణ్, ప్రవీణ్ తదితరులున్నారు.

## బీఎంఎస్ బలోపేతానికి కృషి

**బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి నంద కిశోర్**

జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి నంద కిశోర్, తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 8: బీఎంఎస్ బలోపేతానికి కృషి చేయాలని బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి నంద కిశోర్ పిలుపునిచ్చారు. శంషాబాద్ పట్టణంలో బీఎంఎస్ కారు ట్యాక్సీ యూనియన్ శంషాబాద్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో గురువారం జెండాను ఆవిష్కరించారు. ఇందుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి నందకిశోర్ విచ్చేసి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీఎంఎస్ బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా కారు ట్యాక్సీ డ్రైవర్లకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లకు అవసరమైన సలహా సూచనలు ఇచ్చి వారికి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర కమిటీ నుంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో జాగ్రతలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. శంషాబాద్‌లో బీఎంఎస్ సంఘాన్ని బలమైన శక్తిగా తయారు చేయడం కోసం సభ్యులు కృషి చేయాలన్నారు. ట్యాక్సీ డ్రైవర్లను ఎవ్వరైనా అధికారులు అకారణంగా వేధిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్, మండల కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సహాయ కార్యదర్శిలు గిరి, బాలరాజు, విజయ్ కే రాజులతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## బస్తీలలోని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: సోమాజిగూడ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయించాలని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ గురువారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే అధికారులను సమావేశపరిచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, యాదగిరి ఉన్నారు.

## తెరుచుకున్న రేషన్ షాపు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: బంజారాహిల్స్ రోడ్ నం.14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలో గత కొంతకాలంగా మూతపడిన రేషన్ షాపును గురువారం తెరిశారు. స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి రేషన్ షాపు వద్దకు వచ్చి స్థానికులతో మాట్లాడారు. సుమారు ఏడాదిన్నర కాలంగా రేషన్ షాపు లేకపోవడంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడ్డామని వారు పేర్కొన్నారు.

## కష్టపడకుండా.. ఇష్టపడి చదవండి: డీఈఓ

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 8: బోధనా పద్ధతుల్లో వచ్చిన మార్పుల కారణంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన ఉన్నదని డీఈఓ రోహిణి అన్నారు. బోరబండ నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులకు ఇటీవల క్రీడా పోటీలు నిర్వహించగా, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రోహిణి మాట్లాడుతూ, పరీక్షలు దగ్గర పడుతుంటే కష్టపడి చదవటం కన్నా, ఎప్పటికప్పుడు ఇష్టపడి చదివితేనే మంచిదన్న విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులను సమకూర్చటం జరిగిందన్నారు. చదువుతో పాటు క్రీడాంశాల్లో రాణించటానికి విద్యార్థులకు శిక్షణ లభించేలా చేస్తామని అన్నారు. ఈ సారి టెన్త్ పరీక్షల్లో నాట్కో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్న ఆశాభావాన్ని అమె వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గీతతో పాటు బోరబండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఉప విద్యాధికారి సామ్యూల్ రాజు, ఉపాధ్యాయులు ప్రేమవాణి, లక్ష్మీకుమారి, శ్రీనివాసరావు, పవన్ కుమార్, ఫిజికల్ డైరక్టర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదగాలి

మైలార్‌దేవపల్లి, ఫిబ్రవరి 8: విద్యార్థులు అన్ని రంగాలలో పాలుపంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని మైలార్‌దేవపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.మధు అన్నారు. మధుబన్ కాలనీలోని శ్రీ గాయత్రి ఈ-టెక్నో స్కూల్ విద్యార్థులు గురువారం విజ్ఞాన విహార యాత్రలో భాగంగా మైలార్‌దేవపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్సై హసీనా విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన వివరాలు వివరించారు. షీ టీమ్, సైబర్ నేరాలు, లా అండ్ ఆర్డర్ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మధు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచే చురుకుగా ఉంటూ తమ ఎదుగుదలకు ఉపయోగపడే విషయాలను తెలుసుకోవాలన్నారు. అలాగే, సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొంపల్లి మధుసూదన్, డైరెక్టర్ సమీయుద్దీన్, ఉపాధ్యాయులు,

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన గురువారం జరిగింది. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన ప్రకారం, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం పానకల్లు గ్రామానికి చెందిన కోమాకుల అశోక్(33) కుటుంబం బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి ఖైరతాబాద్‌లోని మారూతీనగర్‌లో స్థిరపడ్డారు. అశోక్ పంజాగుట్టలోని సువిధ హాస్పిటల్‌లో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య సౌజన్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అశోక్ మద్యానికి బానిసైనట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీంతో తీవ్ర మానసిక క్షోభతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

## చిట్టీల పేరిట మోసం

**నిందితుడిపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు**

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.., ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎస్.జయరాముడుతో పాటు అతడి భార్య రేణుకాదేవి, కొడుకు ఉపేందర్‌బాబు తదితరులు బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉంటున్న నాగరాజు యాదవ్ అనే వ్యక్తి వద్ద 2018 నుంచి చిట్టీలు వేస్తున్నారు. వీరితో పాటు మోతీనగర్‌కు చెందిన అతడి స్నేహితుడు వెంకట్‌రెడ్డి కూడా చిట్టీ వేశాడు. వీరంతా కలిసి సుమారు 19.75 లక్షలు చెల్లించారు. కాగా, చిట్టీ గడువు ముగిసినా నాగరాజు యాదవ్ డబ్బులు చెల్లించకపోగా ముఖం చాటేయడం ప్రారంభించాడు. పలుమార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు ఇటీవల ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని ఉడాయించాడు. దీంతో తమను మోసం చేసిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జయరాముడు గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎన్‌సీడీ యాప్‌లో ఆభా కార్డుల అనుసంధానం

**దేశంలో ఎక్కడి నుంచైనా వైద్య సహాయం పొందేందుకు అవకాశం..**

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రవేశపెట్టిన నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్‌ను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరిస్తున్నారు. ఎన్‌సీడీ వ్యాధుల జాబితాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ (ఆభా) కార్డులకు అనుసంధానం చేస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది అనారోగ్య సమస్యలపై క్రమం తప్పకుండా సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్ నివారణకు ఇప్పటికే మందుల కిట్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది ఆయా గృహాలలో 30 ఏండ్లు పైబడిన వారికి మందుల కిట్లతో పాటు ఎన్‌సీడీ యాప్‌లో ఆభా కార్డుల నమోదు చేపడుతున్నారు. ఎన్‌సీడీలో ఆయా లక్షణాలున్న వారు అధిక రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉండేందుకు క్రమం తప్పుండా మందులు పంపిణీ చేస్తున్నారు. కాగా, ఎన్‌సీడీలో నమోదైన వారికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు.. ఆభా కార్డులతో తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ఎక్కడి నుంచైనా వైద్య సహాయం పొందేందుకు ఆయా బాధితులకు విధిగా నమోదు చేపడుతున్నామని వైద్య అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేపట్టి ఆయా నివేదికల ఆధారంగా వారికి అవసరమైన మందులను ఇంటికి వెళ్లి అందజేయడంతో పాటు ఎన్‌సీడీ యాప్‌లో ఆభా కార్డుల నమోదు చేపడుతున్నారు. ఈ మేరకు శ్రీరాంనగర్ క్లస్టర్ పరిధిలోని యూసుఫ్‌గూడ డివిజన్‌లో శ్రీరాంనగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌లు ఎన్‌సీడీ సర్వే చేపడుతున్నారు.

యూసుఫ్‌గూడలో ఎన్‌సీడీ కిట్లు పంపిణీ చేస్తున్న ఆశా వర్కర్లు లక్ష్మి, రాజమణి(ఫైల్)

## తేనే టీగల పెంపకంపై 15 నుంచి జాతీయ సదస్సు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: శాస్త్రీయ తేనేటీగల పెంపకంపై ఈ నెల 15, 16 తేదీల్లో యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ క్యాంపస్‌లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు నిమ్స్‌మే ఫ్యాకల్టీ మెంబర్ డాక్టర్ శ్రీకాంత్ శర్మ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఫ్యాకల్టీ సభ్యులు డి.శిరీశ్ కులకర్ణి, అసోసియేట్ ఫ్యాకల్టీ సభ్యులు వీబీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. డాక్టర్ శ్రీకాంత్ శర్మ మాట్లాడుతూ, తేనెటీగల పెంపకం, తేనే ఉత్పత్తి తద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాధి తదితర అంశాలపై సదస్సులో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తేనేకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. తేనేతో పాటు రాయల్ జెల్లీ, పోలెన్ బాల్స్, వ్యాక్స్, ప్రొపోలీస్, వెనమ్ తదితర ఉత్పత్తుల ద్వారా లాభాలు పొందడం, ఔత్సాహికులైన రైతులు, యువతను ఈ రంగం వైపు ప్రోత్సహించడం కోసం ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఆసక్తి గలవారు సదస్సులో పాల్గొనవచ్చన్నారు. సదస్సులో తేనే ఉత్పత్తులను ఉచితంగా ప్రదర్శించుకోవచ్చని, మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. సదస్సులో పాల్గొనే వారు ఫోన్ నం: 040-23633228, 040-23633231 సంప్రదించాలి.

## కార్మికుల హక్కుల సాధనకు సిద్ధం కండి

మైలార్‌దేవపల్లి, ఫిబ్రవరి 8: కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్ జాజాల రుద్రకుమార్ అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో పలు పరిశ్రమలలో సమ్మె నోటీసులు అందజేశారు. కాటేదాన్‌లోని శ్రీనాథ్ రోడ్డు ప్యాక్, పీపీఎల్‌తో పాటు పలు పరిశ్రమలల్లో సమ్మె నోటీసులను పరిశ్రమల యజమానులకు అందించారు. ఈ సందర్భంగా రుద్ర కుమార్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 16న కార్మికుల హక్కుల కోసం సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు. కనీస వేతనాలు రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం తదితర సమస్యలపై ఉద్యమించనున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల యజమానులు, కార్మికులు ఈ సమ్మెను విజయవంతం చేసేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి భాస్కర్, సీఐటీయూ నాయకులు కాలె రాజు తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో ఓ పరిశ్రమ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు రుద్ర కుమార్ తదితరులు

## నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

**కేంద్ర ప్రభుత్వానికి పలు విద్యార్థి సంఘాల డిమాండ్**

సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 8: నూతన జాతీయ విద్య విధానాన్ని రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ నే